క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



తయారు చేసిన వస్తువులతో విద్యార్థులు

బుక్కరాయసముద్రం: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని హ్యూమనిటీస్ అండ్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వినత అన్నారు. శనివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో హ్యూమనిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పేపర్ బ్యాగ్ డే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే విధంగా బీటెక్ విద్యార్థులు విభిన్న రీతిలో వార్తా పత్రికలను ఉపయోగించి రక రకాలుగా పేపర్ బ్యాగులను తయారు చేశాన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణం కాలుష్యం ఏర్పడుతోందన్నారు. వాటి వలన జీవరాశులు నష్టం కలిగే అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ సంఘ్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో శనివారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు కార్మికులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ సంఘ్ బ్రాంచ్ సెక్రటరీ సుభాష్ బాబు ఆధ్వర్యంలో డీజిల్‌షెడ్‌లోని అన్ని విభాగాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ నెల 15న గుత్తి రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎంప్లాయీస్ సంఘ్ తరఫున తొమ్మిది మంది అభ్యర్థుల బరిలో నిలిచారని, అందరినీ గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ వర్కింగ్ కమిటీ సభ్యులు కుళ్లాయప్ప, ఓపెన్ లైన్ బ్రాంచ్ చైర్మన్ నారాయణ, హెడ్ క్వార్టర్స్ బ్రాంచ్ చైర్మన్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీ కొన్న ఐచర్

- ఒకరికి గాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తి అనంతపురం గ్రామ సమీపంలోని 44 నెంబర్ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఐషర్ వాహనం ఢీ కొన్న ఘటనలో ఐషర్ వాహన డ్రైవర్ షరీఫ్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు..అనంతపురం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని మధ్యప్రదేశ్‌కు చెందిన షరీఫ్ ఐచర్ వాహనంలో హైదరాబాద్ వైపు వెళ్తూ.. వెనుక నుంచి లారీని ఢీ కొట్టి డ్రైవర్ ఇంజిన్‌లో ఇరుక్క పోయాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని డ్రైవర్‌ను జేసీబీ సాయంతో బయటకు తీసి గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

నెట్టికంటుడికి ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్ల వితరణ



ఆలయ సిబ్బందికి ఫ్యాన్లు, ఎల్ఈడీ ఫ్లడ్ లైట్లను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కర్నూలుకు చెందిన పల్లె నరేంద్రనాథ్‌రెడ్డి, జ్యోత్స్న దంపతులు శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి ఆరు ఫ్యాన్లు, నాలుగు ఎల్ఈడీ ఫ్లడ్ లైట్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున అర్చకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న విగ్నేష్

గుత్తి: పట్టణ శివారులోని చెరువు కట్ట వద్ద విగ్నేష్ అనే వ్యక్తి శనివారం విష రసాయన తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుంతకల్లు మండలం పాత కొత్తచెరువు గ్రామానికి చెందిన విగ్నేష్ తల్లిదండ్రులు సరిగా ఆస్తి పంపకాలు చేయలేదనే నెపంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



సన్నని ధారతో ప్రవహిస్తున్న జలపాతం



నీరు లేక ఎండిపోతున్న కోనేరు

కనుమరుగవుతున్న 'ఆలూరు కోన'

- వర్షాలు లేక సన్నని ధారలా ప్రవహిస్తున్న జలపాతం
- విచ్చలవిడిగా బోర్ల తవ్వకాలతో వినిపించని జల సవ్వడి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణానికి కూతవేటు దూరంలో ప్రకృతి ఒడిలో నెలకొన్న ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయం వద్ద ఉన్న జలపాతం వర్షాలు లేని కారణంగా కనుమరుగవుతోంది. కోనక్షేత్రంలో శేషతల్పంపై సేద తీరుతున్న రంగనాథస్వామిని చూసి భక్తులు ఎంతగా భక్తి పారవశ్యం పొందుతారో అక్కడి జలపాతంలో సేదతీరడంలోనూ అంతే పారవశ్యం లోనవుతారనడంలో అతిశయోక్తి లేదు. అయితే ఈ ఏడాది వర్షాలు లేని కారణంగా జలపాతం అడుగంటిపోయింది. చిన్ననీటి ధారతో వస్తున్న జలపాతం భక్తులకు నిరాశను మిగులుస్తోంది. దశాబ్ద క్రితం కోన క్షేత్రంలో మూడు నాలుగు చోట్ల జలపాతాలు కనిపించేవి. ప్రస్తుతం ఒకే ఒక్క చోట మాత్రమే జల సవ్వడులు కనిపిస్తున్నాయని, అదీ కూడా అంతంత మాత్రంగానే ప్రవహిస్తోందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవకపోవడంతో పాటు ఆలయంపై భాగంలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ నిర్వాహకులు జలపాతం వచ్చే దారిలో విచ్చలవిడిగా బోరుబావులు తవ్వి జలపాతం అడుగంటిపోవడకానికి కారణం అవుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో జలపాతం ఆనవాలు మిగిలే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని జలపాతాన్ని పునరుద్ధరణకు చర్యలు చేపటాలని భక్తులు కోరుతున్నారు.



రైల్వే గేట్ పక్కనే మండీబజార్‌కు వెళ్లే దారిలో మురుగు నీరు నిల్వ ఉన్న దృశ్యం

రహదారిపై మురుగునీరు

గుంతకల్లుటౌన్: పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ధర్మవరం రైల్వే గేట్ ఏరియాలో మండీ బజార్‌కు వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. రైల్వే గేట్ పక్కనే రోడ్డు గుంతల మయంగా ఉండటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు స్కూళ్లు, బ్యాంకులు, పోస్టాఫీసుతో పాటు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, మున్సిపల్ వాటర్ ట్యాంక్‌కు వెళ్లే ఈ ప్రధాన దారిలో ఏర్పడిన గుంతలో నిల్వ ఉంటున్న మురుగు నీరు వాహనాలు వెళ్లినప్పుడల్లా ప్రజల మీద చిట్లుతుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అసలే వర్షాకాలం.. ఆదమరిచి ఆ మార్గం మీదుగా వస్తే ప్రమాదాలు జరిగే అవకాశముంది. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా చూడాల స్థానికులు కోరారు.

బాధితులకు న్యాయం చేయండి



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న మండలాధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం:చెన్నంపల్లిలో టీడీపీ నాయకుల చేతిలో గాయపడిన బాధితులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు సీఐ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గువ్వల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నంపల్లిలో ఈ నెల 9 రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారన్నారు. గాయపడిన వారు అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. అయితే దాడి జరిగిన సమయంలో గ్రామంలో లేని వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ నాయకులు కేసుల్లో ఇరికించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు బయపరెడ్డి, కాటమయ్య, రాజా, కాలువ నారాయణస్వామి, రాజారెడ్డి, చిన్నపరెడ్డి, పుల్లయ్య, శేషానందరెడ్డి, భాస్కర్, రవి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

తరిమెల నాగిరెడ్డి వర్ధంతిని విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

శింగనమల: కమ్యూనిస్టు నాయకుడు, పేదల పక్షపాతి తరిమెల నాగిరెడ్డి 49వ వర్ధంతిని విజయవంతం చేద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కోరారు. శనివారం శింగనమలలోని రామాలయంలో అందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు మాట్లాడుతూ తరిమెల నాగిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 28న శింగనమలలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, పేదలు తరలి వచ్చి ర్యాలీ తదిరత కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు తరిమెల రామాంజినేయులు, అఖిల భారత రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి కృష్ణ, పట్టణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనారప్ప, మండల కమిటీ సభ్యులు లక్ష్మీరంగయ్య, శ్రీరాములు, నాగప్ప, దైవత్వం, శంకర, రాజు తదితరులు పాల్గొన్నారు.

14,15న 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'



సాకే శైలజానాథ్

శింగనమల: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 14, 15 తేదీల్లో నియోజకవర్గంలోని గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త , మాజీ మంత్రి సాకే శైలజానాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14న ఉదయం 10 గంటలకు యల్లనూరు మండలం, 11.30 గంటలకు పుట్లూరు మండలం, సాయంత్రం 4 గంటలకు బుక్కరాయసముద్రం మండలం, 15వ తేదీ 10 గంటలకు నార్పల, 11.30 గంటలకు శింగనమల, మధ్యాహ్నం 3 గంటలకు గార్లదిన్నె మండలాల్లో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వ్యవసాయ భూముల్లో ప్లాట్లు

- నిబంధనలు పాటించని రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



అనుమతులు లేకుండా సుంకులమ్మ ఆలయం వద్ద వ్యవసాయ భూమిలో ప్లాట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

పుట్లూరు: రైతులు పంటలు పండించే భూములను కొనడం...వాటిని సెంట్లలోకి మార్చు చేసి ప్లాట్లుగా అమ్మడం .. తక్కువ పెట్టుబడి అధిక లాభం.. ఈ వ్యాపారం చేయడానికి కాస్త పలుకుబడి ఉంటే చాలు ఎలాంటి అనుమతులు తీసుకోకపోయినా తమకు ఎలాండి ఢోకా లేదని భావిస్తున్నారు రియల్ ఎస్టేట్ వ్యాపారులు. తాడిపత్రి పట్టణానికి ఎమినిది కిలోమీటర్ల దూరంలో ఉండే పుట్లూరు మండలంలోని గాండ్లపాడు సమీపంలో వ్యవసాయ భూములను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ప్లాట్లుగా ఏర్పాటు చేయడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోవడంతో పాటు వ్యవసాయ భూమిని కమర్షియల్‌కు మార్పు చేసుకోవాల్సి ఉండగా ఎలాంటి నిబంధనలు పాటించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం వ్యవసాయ గోదాము ఎదుట పొలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పంచాయతీ అధికారులు రాళ్లను తొలగించి అనుమతి లేకుండా ప్లాట్లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికీ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గాండ్లపాడు సమీపంలోని పలు వ్యవసాయ భూములు ప్లాట్లుగా మార్పు చేయడం, వాటిని వాయిదాల పద్ధతిలో విక్రయాలు చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ అలివేలమ్మను వివరణ కోరగా నిబంధలకు విరుద్ధంగా ప్లాట్లు ఏర్పాటు చేసి విక్రయిస్తే.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు గాండ్లపాడు పంచాయతీ పరిధిలో ప్లాట్ల ఏర్పాటుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న వైద్యుడు గంగాధర్

గుంతకల్లుటౌన్: జనాభా అదుపునకు కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని వైద్యాధికారులు గంగాధర్, అరుణ సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక షికారీ కాలనీలో కుటుంబ నియంత్రణలో మధ్యంతర గర్భనిరోధక విధానాల, పిల్లల మధ్య అంతరం గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా కుటుంబ నియంత్రణ విధానాల్లో పిల్లల మధ్య అంతరం వల్ల తల్లి,శిశువు ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అందులో భాగంగా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఐయూడీలు, మహిళల కోసం మాత్రలు, కండోమ్‌లు, ఇంజెక్షన్లు, ఎమర్జెన్సీ పిల్స్ అందుబాటులో ఉంచామన్నారు. అలాగే టీనేజీ ప్రెగ్నెన్సీ అనేక శారీరక, మానసిక, సామాజిక ఆర్థిక సమస్యలను కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, ఆరోగ్య సిబ్బంది ఆషా, గ్రేస్ పద్మలత, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే విద్యాభివృద్ధి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుత్తి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కోసం ఏకంగా రూ. 73 వేల కోట్లు ఖర్చు పెట్టారని వైసీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యాభివృద్ధిపై శనివారం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సుమారు పది లక్షల ట్యాబ్‌లు అందజేశారన్నారు. నాడు–నేడు పథకంతో పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేశారన్నారు. అమ్మ ఒడి పథకంతో లక్షలాది మంది పేద పిల్లలను చదివించారన్నారు. 16 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. అమ్మ ఒడి పథకం పేరు మార్చి తల్లికి వందనం అని కూటమి ప్రభుత్వం పెట్టిందన్నారు. వైఎస్ జగన్ పథకాలకు పేరు మార్చడం తప్పా కూటమి ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల ఉపాధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, ప్రచార కమిటీ మండల అధ్యక్షులు దేవేంద్ర, ఐటీ వింగ్ నాయకులు రాంబాబు, సుభాష్ చంద్రబోస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ కోసం రేపటి నుంచి రిలే దీక్షలు

పామిడి: పేదల ఆశాదీపమైన ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ కోసం సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఐక్య మాదిగ సమాజ్ వ్యవస్థాపక అధక్షుడు వంక రాజుకాలువ వెంకటేష్ శనివారం తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద వంద గంటల రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. దీక్షలకు ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాలు సహకారం అందించి ఆర్డీటీని కాపాడుకోవాలన్నారు. ప్రజలు స్వచ్ఛంగా పాల్గొని దీక్షలు జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు చర్చా వేదిక

అనంతపురం కల్చరల్: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరణ అంశంపై రచయితలు, కవులు, మేధావులు ఆదివారం ఉదయం 9.30 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్ వేదికగా చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాలపై డాక్టర్ శాంతినారాయణ, వెంకటరెడ్డి రెడ్డప్పరెడ్డి, ఉప్పరపాటి వెంకటేశులు, వహబ్‌ఖాన్, హనుమంతరాయుడు, ఆదవాల శేషగిరిరాయుడు తదితరులు ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో సాహిత్యాభిమానులు తమ అభిప్రాయాన్ని వెల్లడించడానికి తరలి రావాలని ఆయన కోరారు.

ఆరుగురు రైతుల పొలాల్లో కేబుల్ చోరీ



స్టార్టర్ పెట్టె వద్ద విద్యుత్ వైరును అపహరించిన దృశ్యం



మోటార్‌కు ఉన్న విద్యుత్ వైరును దొంగలు ఎత్తుకెళ్లారని చెపుతున్న రైతు మోహన్‌బాబు

యాడికి: మండలంలోని చందన గ్రామంలో వ్యవసాయ బోరుబావుల్లోని మోటార్లకు అమర్చిన విద్యుత్ తీగలను శుక్రవారం రాత్రి అపహరించారు. గ్రామ సమీపంలో ఉన్న పొలాల్లో రైతులు మోహన్ బాబు, ఆది, క్రిష్టప్ప, పరమేశ్వర, బలరాముడు, శివయ్య అరటి పంటను సాగు చేశారు. ఆరుగురు రైతుల బోరుబావులకు 30లీటర్ల విద్యుత్ వైరును ఉండగా శుక్రవారం రాత్రి దొంగలు అపహరించారు. శనివారం ఉదయమే పొలాలకు చేరుకున్న రైతులు పంటకు నీరు వదులుదామని మోటార్లు ఆన్ చేయగా .. అవి పనిచేయలేదు. గమనించిన రైతులు విద్యుత్ వైర్ల చోరీ గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పట్టించుకోకపోవడంతో వెంటనే కేబుల్ కొని బోరుబావులకు మళ్లీ విద్యుత్ వచ్చేటట్లు చేసుకున్నామని బాధిత రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గ్రామాల్లోని వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్ చోరీలను నివారించాలని బాధిత రైతులు కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గార్లదిన్నె: మండలంలోని కమలాపురంలో శనివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపిన వివరాలు మేరకు.. కమలాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 28,150 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెంగమనాయుడుకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి రూరల్: పట్టణంలో శనివారం సీపీఐ నాయకుడు పి.వెంగమనాయుడు వర్ధంతి పట్టణ కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, నాగేంద్ర నాయకులు సూరి, రమణ పాల్గొన్నారు.

భూముల సర్వేల కోసం అన్నదాతల అవస్థలు

పుట్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో భూముల సర్వే కోసం రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూముల హద్దులను చూపాలంటూ వస్తున్న వినతులను పరిష్కరించడంలో సర్వేయర్లు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల వల్ల సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో వినతులను పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినతులను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

కల్లూరులో వైద్య సిబ్బంది పర్యటన



కల్లూరులో గ్రామస్తులకు సూచనలిస్తున్న వైద్యసిబ్బంది



డెంగీతో మృతి చెందిన బాలింత ఇంట్లో ఐఆర్ స్ప్రేయింగ్ చేస్తున్న వైద్యసిబ్బంది

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఓ బాలింత డెంగీ జ్వరంతో మృతి చెందడంతో శని వారం వైద్య సిబ్బంది ఆ గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా మలేరియా విభాగం ఇన్‌చార్జ్ ఆఫీసర్ డాక్టర్ విష్ణు , వైద్య సిబ్బందితో కలసి డెంగీతో మృతి చెందిన బాలింత షేక్ చాందిని ఇంటిని పరిశీలించి, చుట్టుపక్కల ప్రాంతంలో ఫీవర్ సర్వే చేసి, ఇంటింటికీ డోర్ ఐఆర్ స్ప్రేయింగ్ చేశారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ షేక్ చాందినికి కిట్ మెథడ్ లో మాత్రమే డెంగీ పరీక్ష చేశారన్నారు. ఎలీసా పరీక్ష ద్వారా డెంగీ నిర్ధారణ చేయాలన్నారు. అలాగే శరీరంలో మల్టీ ఆర్గాన్స్ ఫెల్యూర్ ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ మంజుల, సీహెచ్ఓ లోక్‌నాథ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతుల వెల్లువ

గుంతకల్లు: గుంతకల్లు పర్యటనకు విచ్చేసిన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస శర్మకు వినతులు వెల్లువెత్తాయి. స్థానిక రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన 16వ రోజ్ గార్ మేళా కార్యక్రమం అనంతరం పట్టణంలోని నామాల్ సేట్ కళ్యాణమండంలో బీజేపీ కార్యకర్త సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పలువురు పలు సమస్యలపై కేంద్ర సహాయ మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. గుంతకల్లు మండలంలోని తిమ్మాపురం, దొనిముక్కలకు చెందిన రైతుల పొలాల్లో ఇప్పటికే జాతీయ రహదారికి భూములు కోల్పోయారు. ఇప్పుడు అదే మార్గానికి పక్కన మరో రైల్వే లైన్ (బైపాస్ రైలు మార్గం)కు ప్రతిపాదనలు పంపడమే కాకుండా పొలాల్లో మార్కులు వేసి రాళ్లు పాతారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములపైన ఆధారపడి జీవిస్తున్న తాముకు మిగిలిన భూములు కూడ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కావున ఈ రైలు మార్గం ప్రత్యాయ మార్గాల్లో మళ్లించాలని కోరారు. అలాగే గుంతకల్లులో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 35 ఏళ్లుగా మూత బడిన స్పిన్నింగ్ మిల్లుల్లో ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రి శ్రీనివాస్ వర్మకు కోరారు. తద్వారా కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు.